ప్రజాశక్తి
సోమవారం 30 సెప్టెంబర్ 2024 5 అనంతపురం





పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి సమావేశాల పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ ఎఫ్ ఐ) ఆధ్వర్యంలో అక్టోబర్ 5 నుంచి 8 వ తేదీ వరకు అనంతపురంలో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తత స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని కేరళ రాష్ట్ర ప్రణాళికా సంఘం అధ్యక్షులు వికె రామచంద్రన్ పిలుపునిచ్చారు. లెనిన్ జయంతి సందర్భంగా ఆదివారం అలేఖ్య ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తతస్థాయి సమావేశాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వికె. రామచంద్రన్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి విద్యను వ్యాపారీకరణ ప్రైవేటీకరణ కాషాయం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. అందులో భాగంగా దేశం లో నూతన జాతీయ విద్యా విధానం తీసుకువస్తోందన్నారు. ఇది రాష్ట్రాల హక్కులు కాలరాస్తుందన్నారు. విద్య ఉమ్మడి జాబితా అయినప్పటికీ రాష్ట్ర ప్రమేయం లేకుండా చేస్తుందని దీనిని కేరళ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ విషయంలో మిగతా రాష్ట్రాలు కలిసి రావాలన్నారు. దేశంలో అందరికీ ప్రభుత్వ విద్యఅందే విధంగా కలిసి పోరాటం కొనసాగించాలన్నారు. ఆప్రయత్నంలో భాగంగానే అక్టోబర్ 5,6,7,8 తేదీల్లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాలలో కేంద్రంలోని బిజెపి విధానాలు వ్యతిరేకంగా పోరాటానికి ఎస్ఎఫ్ఐ శ్రీకారం చుడుతోందన్నారు. రాష్ట్రంలో వైద్య విద్య ప్రైవేటీకరణ చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఎంసికి లేఖ రాయడం దౌర్భాగ్యమని దీనిని ఎస్ఎఫ్ఐ ఖండిస్తోందని చెప్పారు. పీజీ విద్యార్థుల స్కాలర్షిప్ రద్దు చేయడంలో జీవో నెంబర్ 77 ప్రధాన పాత్ర పోషిస్తుందని దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్దు, జిల్లా సహాయ కార్యదర్శులు భీమేష్, శివ, వంశి ఎస్ఎఫ్ఐ అనంతపురం నగర నాయకులు గణేష్, సోము, సాయి, ఎస్కే యూనివర్సిటీ నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గ స్వరూపం మార్పుతోనే సమసమాజం

లెనిన్ శతవర్ధంతి సభలో ప్రొఫెసర్ వికె.రామచంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న కేరళ ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ వి కె. రామచంద్రన్

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

'అధికార మార్పిడి జరిగినంత మాత్రానా సమసమాజ స్థాపన సాధ్యం కాదు.. పాలకవర్గ స్వరూపంలోనే మార్పు రావాల్సి ఉంద'ని కేరళ ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ప్రొఫెసరు వికె.రామచంద్రన్ పేర్కొన్నారు. లెనిన్ శతవర్ధంతి సందర్భంగా అనంతపురం నగరంలోని అలేఖ్య ఫంక్షన్ హాలులో సిపిఎం అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ సందర్భంగా 'రాజ్యం-విప్లవం' అన్న అంశంపై సదస్సు జరిగింది. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొదట లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు అర్పించారు. ఈ సందర్భంగా వికె.రామచంద్రన్ మాట్లాడుతూ నేటి పెట్టుబడీదారి వ్యవస్థలో పేద, ధనికుల మధ్య అంతరాలు అనివార్యమని మార్క్స్, లెనిన్‌లు ఇద్దరూ ఆనాడే తమ రచనల ద్వారా తెలియజేసారని గుర్తు చేశారు. ఈ సమాజంలో పాలకవర్గాలన్నీ కూడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకే పనిచేస్తాయన్నారు. అందుకే ఈ సమాజంలో ఆర్థిక అసమానతలు అధికమని వివరించారు. రష్యాలో సోవియట్ పతనమైన 1991 తరువాత పెట్టుబడీదారి వ్యవస్థ మరింత బలపడిందన్నారు. భారతదేశంలోనూ స్వాతంత్రానికి పూర్వం సమసమాజ భావనలే అధికంగా ఉండేవని తెలిపారు. అయితే క్రమంగా వారి మారుతూ బడాపెట్టుబడి,పెట్టుబడి, భూస్వామ్య లక్షణాలు పెరిగాయని పేర్కొన్నారు. 1991లో సరళీకరణ ఆర్థిక విధానాలు దేశంలో అమలు చేయడం ప్రారంభించాక మరింత వేగవంతమయ్యాయన్నారు. దీనికి మతతత్వం కూడా తోడైందన్నారు. అప్పటి నుంచి ఆర్థిక అంతరాలు మరింతగా పెరుగుతూపోతున్నాయన్నారు. దేశంలో 271 మంది బిలియనర్స్ ఉన్నారన్నారు. ఇందులో 94 మంది గడిచిన రెండేళ్లలో కొత్తగా పుట్టుకొచ్చారన్నారు. మరోవైపు పేదరికం, దారిద్ర్యం పెరుగుతోందన్నారు. ప్రతి నలుగురు చిన్నారుల్లో ముగ్గురికి సరైన పౌష్టికాహారం లభించడం లేదన్నారు. ఇది యూనెస్కో చెబుతున్న గణాంకాలేనని వివరించారు. కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. రోజూ పనికెళ్లినా కుటుంబం నెట్టుకురాలేని పరిస్థితులు దేశంలో ఉన్నాయన్నారు. ఈ అంతరాలు పోవాలంటే పాలకవర్గ స్వభావం మార్చాల్సి ఉంటుందన్నారు. స్వభావం మారడమంటే సమాజ మార్పు జరగాల్సి ఉందన్నారు. ఈ లక్ష్యంతోనే 1964 తరువాత సిపిఎం ఏర్పాటైందన్నారు. అప్పటినుంచి దేశంలో ఆర్థిక అసమానతలను రూపుమాపే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. దేశంలోనున్న నిర్దిష్ట పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అందుకు అనుగుణంగా తమ ప్రణాళికలో మార్పులు చేసుకుని ముందుకెళ్లడం జరుగుతోందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో లెనిన్ ఆలోచనలను మరోమారు పునరుచ్చరణ చేసుకోవాల్సి ఉందన్నారు. అందుకోసమే ఆయన శతవర్ధంతి సభలను రాష్ట్రంలో ప్రత్యేకంగా ఈ ఏడాది నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబుళు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.సావిత్రి, ఒ.నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్ర, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు జాగిలంతో రైళ్లలో తనిఖీలు

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా అనంతపురంలో పోలీసులు రైళ్లలో తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్స్ పసిగట్టడంలో సుశిక్షణ పొందిన షైనీ జాగిలం ద్వారా జిల్లా కేంద్రం గుండా వెళ్లే రైళ్లలో స్థానిక త్రీటౌన్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు ఎస్ఐ గోపాలుడు ఆధ్వర్యంలో త్రీటౌన్ పోలీసు సిబ్బంది, బాంబు డిస్పోజబుల్‌బృంద సభ్యులు, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా ఒడిస్సాలోని భువనేశ్వర్ నుండీ బెంగుళూరుకు అనంతపురం మీదుగా వెళ్లే ప్రశాంతి ఎక్స్ ప్రెస్‌లో తనిఖీలు చేశారు. సాధారణ ప్రయాణీకులకు అసౌకర్యం కలగకుండా ఈ తనిఖీలు కొనసాగాయి. గంజాయి, మద్యం అక్రమ రవాణా జరుగకుండా చెక్ చేశారు. అనుమానాస్పదులను, వారి లగేజీలను షైనీ జాగిలం ద్వారా తనిఖీ చేశారు.



పోలీసుజాగిలంతో తనిఖీ చేస్తున్న దృశ్యం

'శ్రీరామిరెడ్డి, సత్యసాయి' కార్మికుల మెరుపు సమ్మె

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకాల్లో పని చేస్తున్న కార్మికులకు వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మెరుపు సమ్మెకు దిగారు. ఇందులో భాగంగా నీలకంఠాపురం, శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్, రాయదుర్గం ఫేస్ ఫోర్ పిఎబిఆర్, ఆలూరు, వీరాపురం, రాయదుర్గం మోటార్లను బంద్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ట్రెజరర్ వన్నూరుస్వామి మాట్లాడుతూ గతంలో సమ్మె చేయగా ప్రభుత్వం బకాయి వేతనాలు చెల్లించడంతోపాటు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇంత వరకూ పట్టించుకోలేదన్నారు. దీంతో చేసేది లేక మెరుపు సమ్మెకు దిగినట్టు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయి వేతనాలను తక్షణమే మంజూరు చేయాలని, కోత విధించిన రూ.4,500ను పునరుద్ధరించాలని, కళ్యాణదుర్గంలో 17 మంది కార్మికులకు జీతాలు వేయాలని, తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే 8 నెలల జీతాలు, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలు, కాంట్రాక్టర్ శివశంకర్‌రెడ్డి నుంచి 8మంది కార్మికులకు ఫిబ్రవరి నెల నుంచి జీతాలు ఇప్పించాలని కోరారు. కాగా సోమవారం కార్మికుల డిమాండ్ దినోత్సవంలో అనంతపురంలోని బైపాస్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫేస్ ఫోర్‌కి సంబంధించిన కళ్యాణదుర్గం, రాయదుర్గం కార్మికులు, డివిజన్ అధ్యక్షుడు నరేష్, ట్రెజరర్ రమేష్, నరేష్, ఓలప్ప, రామాంజనేయులు, నరసింహులు, శ్రీరామిరెడ్డి , సత్యసాయి తాగునీటి పథకాల కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : పెండింగ్ వేతనాలతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకాల కార్మికులు ఆదివారం మెరుపు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చేసిన సమ్మె నేపథ్యంలో కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే గత సమ్మెల విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

పర్యవేక్షణ కరువు.. పూర్తిస్థాయిలో రాని నీరు..!

సరిహద్దులో హెచ్చెల్సీకి తగ్గిన నీరు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

తుంగభద్ర ఆయకట్టు నుంచి ఆంధ్రాకు అందిస్తున్న హెచ్ఎల్సీ తాగు, సాగునీరు ఆంధ్ర సరిహద్దుకు పూర్తి స్థాయిలో రావడం లేదు. తుంగభద్ర జలాశయం నుంచి ఆంధ్రా వాటాగా 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే ఆంధ్రా సరిహద్దులో 1400 క్యూసెక్కులు కూడా రావడం లేదు. నీటి సరఫరాపై అధికారుల పర్యవేక్షణ కరువు అవడంతో ఆంధ్రా వాటాగా రావాల్సిన నీరు పూర్తి స్థాయిలో రావడం లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వర్షాలు లేక, మరో వైపు హెచ్ఎల్సీ నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. కురువల్లి కాలువ డిస్ట్రిబ్యూటర్లు 2,3,4 9, 10 ఆయకట్టుకు నీరందిస్తున్నాయి. ఆ డిస్ట్రిబ్యూటర్ల వైపు అధికారులు పర్యవేక్షణ లేకపోవడం నీరు పూర్తి స్థాయిలో రావడం లేదు. ఇప్పటికైనా హెచ్ఎల్సీ కనేకల్ సెక్షన్ డిఈ, సంబంధిత జేఈలు కాలువ పర్యవేక్షణ చేసి పూర్తి స్థాయిలో నీరు ఆంధ్రాకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.




యల్లనూరు పోలీసుస్టేషన్‌లో సిబ్బంది కొరత

శాంతిభద్రతలపై ప్రభావం...

ప్రజాశక్తి-యల్లనూరు

ఇటీవలి కాలంలో యల్లనూరు మండలంలో శాంతి భద్రతలు గాడితప్పుతున్నాయనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఒకదాని తర్వాత ఒక ఘటన మండలంలో చోటు చేసుకుంటూనే ఉన్నాయి. గత వారంలో మండల కేంద్రం నడిరోడ్డులో కాపు కాచి ఇద్దరు వ్యక్తులను దారుణంగా కర్రలతో కొట్టారు. రెండు రోజుల క్రితం మండల కేంద్రంలో ఇద్దరు అన్నదమ్ములు ఘర్షణ పడి ఓ మహిళను గాయపరిచారు. ఇలా మండల వ్యాప్తంగా ఏదో ఒక గ్రామంలో చిన్నచిన్న వాగ్వాదాలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. కాగా మండలంలో తగినంత మంది పోలసు సిబ్బంది లేకపోవడంతో చిన్నచిన్న ఘర్షణలను నివారించడంలో వెనుకబాటు కన్పిస్తోందనే వాదనలు విన్పిస్తున్నాయి. స్టేషన్లో ఐదుగురు జమేదార్లు ఉండాల్సి ఉండగా, ముగ్గురు ఇతర విధుల్లో ఉన్నారు. ఇద్దరు ఎఎస్ఐలు ఉండగా ఒకరు కోర్టు వ్యవహారాలు చూసుకుంటారు. ఆరుగురు కానిస్టేబుళ్లలో ఒకరు డీఎస్పీ కార్యాలయానికి, ఒకరు టర్మోడ్యూటీలో ఉంటున్నారు. మండలంలో 21 పంచాయతీలు, 29 గ్రామాలు 30 వేలకు పైగా జనాభా ఉండడంతో అందుకు తగినంత సిబ్బంది లేకపోవడం పోలీసులకు సమస్యగా మారింది. మండలంలో సమస్యాత్మక గ్రామాలు ఉండడంతో వాటికి ప్రత్యేక పోలీసు సిబ్బందిని కేటాయించాల్సి ఉంది. పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఆరుగురిలో ఒకరు టర్మ్‌డ్యూటీ, మరొకరు స్పెషల్ డ్యూటీలకు వెళ్తుండా మిగిలిన మిగిలిన నలుగురు 21 పంచాయతీలను చూసుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ చొరవ తీసుకొని యల్లనూరు పోలీస్ స్టేషన్‌కు పూర్తి స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేసి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.





సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులు (పాతచిత్రం

రేపు మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

అనంతపురం కలెక్టరేట్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వచ్చేనెల 1వ తేదీన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జెవివి నగర అధ్యక్షులు రామిరెడ్డి, చెకుముకి కన్వీనర్ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని కెఎస్ఆర్ గర్ల్స్ హైస్కూల్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఇఒ బి.వరలక్ష్మి హాజరవుతున్నారన్నారు. అలాగే 25న నిర్వహించిన పాఠశాల స్థాయి చెకుముకి సంబరాలు నగరంలోని 40 పాఠశాలల్లో జరుగుతాయన్నారు.

మత్స్యకార సంఘాల ఏర్పాటుతో ఆర్థికాభివృద్ధి

జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్. చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మత్స్యకారులు చేపల సంఘాలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందవచ్చని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్. చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. చెరువులలో నీరు సమృద్ధిగా ఉన్నప్పుడు మాత్రమే ఆ చెరువులపై ఆధారపడి చేపలను ఉత్పత్తి చేసుకొని వాటి ద్వారా జీవనోపాధి చెందుతున్న కుటుంబాలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి. చెరువులలోకి నీరు వచ్చినప్పుడు మాత్రమే వీరికి జీవనోపాధి దొరుకుతుంది. నీరు రాకుంటే వీరు ఇతర వత్తుల వైపు వెళ్లి జీవించాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏటా కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తోంది. జిల్లావ్యాప్తంగా మూడు వేలకు పైగా కుటుంబాలు ఈ చేపల సంఘాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వీరి అభివృద్ధికి ఏం చర్యలు తీసుకుంటోంది. మత్స్యకారుల జీవన విధానం ఏమిటి అన్న అంశాలపై జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్. చంద్రశేఖర్ రెడ్డి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని చేపల సంఘాలు ఉన్నాయి? ఎన్ని కుటుంబాలు ఇందులో ఉన్నాయి.?

జవాబు : జిల్లావ్యాప్తంగా 47 చేపల వృత్తిదారుల సంఘాలు ఉన్నాయి. ఇందులో 3539 కుటుంబాల సభ్యులు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఒక కులంతో సంబంధం లేకుండా చేపలు పట్టగలిగే ఏ కులం వారైనా సరే సంఘంలో సభ్యులుగా చేరవచ్చు. ఆయా ఆయకట్టు చెరువులకు మాత్రమే ఈ సంఘాలు ఉంటాయి.

ప్ర : చేపల వృత్తి సంఘాల వారికి ప్రభుత్వం పరంగా అందించే సహాయం ఏమిటి.?

జ : జిల్లాలో 226 నీటి ఆయకట్టు చెరువులు ఉన్నాయి. ఇందులో ఇప్పటివరకు 20 చెరువులకు మాత్రమే నీరు వచ్చింది. సహజంగా నవంబర్ డిసెంబర్ నెలల్లో చేప పిల్లలు వదులుతాము. ఒక్క యూనిట్‌కు లక్ష చేప పిల్లలు ఉంటాయి. వీటిని నామమాత్రపు ఫీజుతో 40 శాతం సబ్సిడీతో సంఘాలకు అందజేస్తాం. వాళ్లకు ఇదే ప్రభుత్వ పరంగా పెద్ద సహాయమని చెప్పవచ్చు. అంతేగాక వారికి చేపలు పట్టే వలలు, తెప్పలు సరఫరా చేస్తాం. కొందరికి గతంలో ద్విచక్ర వాహనాలు కూడా సరఫరా చేశాం.



ప్ర : మార్కెటింగ్ సౌకర్యం ఎలా ఉంటుంది.?

జ : ప్రత్యేకంగా మార్కెటింగ్ అంటూ ఏమీ ఉండదు. చేపలు పడుతున్నారని తెలిస్తే ఆయా గ్రామాలతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల వారు సైతం వచ్చి కొనుగోలు చేస్తుంటారు. కొందరు బయట నుంచి వచ్చి కూడా చేపలు కొనుగోలు చేసి చిల్లరగా అమ్ముకుంటుంటారు. కొందరు వ్యాపారులు ఆయా చెరువుల వద్ద చేపలు కొనుగోలు చేసి పట్టణాలకు తరలించి అమ్ముకుంటారు. కాబట్టి ప్రత్యేకంగా మార్కెట్ సౌకర్యం అంటూ ఉండదు. ఎప్పుడో ఒకరోజు చేపలు మిగిలిపోతే వాటిని ఎండబెడతారు. ఎండు చేపలకు కూడా మంచి గిరాకీ ఉంటుంది.

ప్ర: చేప పిల్లలు ఎన్ని మాసాలకు పెద్దగా తయారు అవుతాయి.?

జ : చేప పిల్లలను చెరువులోకి వదిలిన రెండు నెలల లోపే పెద్దవి అవుతాయి. ఒక కేజీ నుంచి మూడు కేజీల పైబడి ఉత్పత్తి అవుతాయి. ఆయా చెరువులలో సంఘ సభ్యులు కాకుండా ఇతరులు దొంగగా చేపలను పట్టుకునే అవకాశాలు లేకపోలేదు. అయితే సంఘం సభ్యులు పగలు, రాత్రి నిత్యం చెరువులలో తెప్పల సహాయంతో పరవేక్షిస్తుంటారు.



ప్ర: కొన్ని చెరువులలో చేప పిల్లలను చంపే అవకాశం ఉందా.?

జ: ఆయా గ్రామ రాజకీయాలు బట్టి ఇలాంటి సంఘటనలు అక్కడక్కడ జరుగుతుంటాయి. 99 శాతం అలాంటి పరిస్థితులు ఏర్పడవనే భావిస్తున్నాము. రాజకీయాలు, గొడవలు, మత్స్యకారులపై వ్యక్తిగత ద్వేషం తదితర అంశాలు కూడా చోటుచేసుకునే అవకాశాలు అక్కడక్కడ ఉండవచ్చు. అలాంటి సంఘటనల వల్ల చట్టపరంగా తగు చర్యలు పోలీసు ద్వారా తీసుకోవచ్చు.

ప్ర : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా.? మత్స్యకారులకు మీరు ఇచ్చే సలహా ఏమిటి.?

జ : సిబ్బంది కొరత అంటూ ఏమీ లేదు. ప్రస్తుతం పెద్ద కమ్మవారిపల్లి సమీపంలో గల దీన జనోద్ధారణ భవన సదుపాయంలో కార్యాలయం ఉంది. పూర్తిస్థాయి కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. సంఘాల ద్వారా సమిష్టి నిర్ణయాలతో అభివృద్ధి చెందవచ్చు.

శ్రీసత్యసాయి జిల్లాలో దంచికొట్టిన వాన

పుట్టపర్తిలో గంటపాటు కుండపోత

జిల్లావ్యాప్తంగా 463.4 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం ఒకగంట పాటు కుండపోత వర్షం కురిసింది. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు వర్షం దంచి కొట్టింది. రెవిన్యూ వారి గణాంకాల మేరకు ఒక పుట్టపర్తి మండలంలో 64.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. జిల్లావ్యాప్తంగా ఎనిమిది మండలాలు మినహా మిగతా 24 మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 463.4 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. ఈ వర్షం వల్ల మండలంలోని పలు చెక్ డ్యాములలోకి నీరు చేరింది.ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి వాతావరణం కాస్త చల్లబడిటంతో వేసవికాలంలో మాదిరి ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు కాస్తా ఉపశమనం పొందారు.

పురంలో భారీ వర్షం....

హిందూపురం : పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలతో పాటు మురుగు కాలువలు పొంగిపొర్లాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే ఇంజనీర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు వివిధ ప్రాంతాలను పరిశీలించారు. జెసిబిలను ఏర్పాటు చేసి మురుగు కాలువల్లో పూడుకుపోయిన మురుగును బయటికి తీయించారు. మురుగు నీరు రోడ్లపై రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డి ఈ ఈ బాలసుబ్రమణ్యం, ఏఈ జనార్ధన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో రోడ్డుపై మోకాలులోతులో నిలిచిన నీరు



హిందూపురంలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

మైనింగ్ రాయిని తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

ప్రజాశక్తి కథనానికి స్పందన

గుంతకల్లు రూరల్ : ములకలపెంట నుంచి మైనింగ్ రాయిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను వన్ టూ టౌన్ సిఐ ఎపి మస్తానయ్య ఆధ్వర్యంలో పట్టుకున్నారు. 'రాయిని దోచి..కోట్లు కొలగొట్టి' అన్న శీర్షికతో ఆదివారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన సిఐ వాహనాల తనిఖీ చేపట్టి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మైనింగ్ రాయిని తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నారు. అనంతరం వాహనాన్ని మైన్స్, మినరల్స్ 1965 చట్టం ప్రకారంగా మైన్స్ డిపార్టెంట్ అప్పగించినట్లుగా సిఐ తెలిపారు.



పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్

నార్పల సంతలో దొంగల హల్‌చల్

వైరల్‌గా మారిన సీసీ పుటేజీలు



సీసీ పుటేజీల్లో లభ్యమైన చోరీ నిందితుడు

నార్పల : మండల కేంద్రంలో ప్రతి శనివారం జరిగే సంతలో సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడే దొంగలు హల్‌చల్ చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన సీసీ పుటేజీ సామాజిక మాద్యమాల్లో వైరల్‌గా మారింది. సంతలో ఓ వినియోగదారుని సెల్‌ఫోన్‌ను దొంగ చాకచక్యంగా కొట్టేశాడు. ఈ దృశ్యం దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఆ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. సీసీ పుటేజీ ఆధారంగా సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడే దొంగలను గుర్తించే పనిలో పోలీసులు పడ్డారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ సాగర్ తెలిపారు.

సభ్యత్వ నమోదుపై సమీక్ష

బ్రహ్మసముద్రం : కళ్యాణదుర్గంలోని ప్రజావేదికలో ఈనెల 30వతేదీన టిడిపి సభ్యత్వ నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీనివాసులు ఆదివారం కొ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ సమావేశానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

హెచ్చెల్సీ పనుల పరిశీలన



జెసిబితో బండరాళ్లను తీస్తున్న దృశ్యం

పుట్లూరు : మండలంలోని చెరువులకు నీటిని నింపేందుకు చేపట్టిన హెచ్చెల్సీ పనులను టిడిపి నాయకులు ఆదివారం పరిశీలించారు. నార్పల మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామ సమీపంలో హెచ్చెల్సీకి నీరు రాకుండా పెద్దఎత్తున బండరాళ్ళు, మట్టి పడడంతో సుబ్బరాయసాగర్ డ్యామ్‌కు వెళ్లే మార్గంలో జెసిబితో పనులు చేస్తున్నారు. ఆయా పనులను టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, గోపురాజుపల్లి రవికుమార్‌రెడ్డి, రామానాయుడు, రామచంద్రనాయుడు, తాజ్, కాంట్రాక్టర్ సాయిప్రసాద్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉరవకొండ : సౌండ్ల వీండ్ ప్రాజెక్ట్ ప్రయివేట్ లిమిటెడ్, గ్రీన్ కో ఫౌండేషన్ సహకారంతో ఆదివారం వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల గ్రామంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి రక్త పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు, ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మల్లెల జగదీష్, వైద్యులు భవ్య, జాన్ క్రిస్టఫర్, సిఎస్ఆర్ జోనల్ కో ఆర్డినేటర్ వేణుప్రసాద్, సైట్ ఇన్‌ఛార్జి జితేందర్, గ్రీన్ కో ప్రతినిధులు రామకృష్ణ, ఆశా కార్యకర్తలు లింగమ్మ, ధనలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడికి సన్మానం



కౌకుంట్ల రవిని సన్మానిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఉరవకొండ : గుంతకల్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన కౌకుంట్ల రవిని ఎంఆర్‌పిఎస్ కులసంఘాల నాయకులు ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లాలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ నాయకుడిగా ఎస్సీ ఎస్టీ సంక్షేమం కోసం రవి ఎన్నో పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా ఎస్సీ ఎస్టీలు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్, దళిత గిరిజన హక్కుల సాధన సమితి, కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



సిఎం రిలీఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

పుట్లూరు : మండలంలోని ఎ.కొండాపురం గ్రామానికి చెందిన రాజాకు రూ.79వేలు, బాలాపురం గ్రామానికి చెందిన ప్రసాద్‌నాయుడుకు రూ.1,19, 500 మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బండారు శ్రావణి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బాల రంగయ్య, కులశేఖర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు విజయ్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

గుత్తి : మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి రమేష్, సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని శ్రీ రామానుజన్ ఉన్నత పాఠశాలలో సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వీధి కుక్కల బెడద ఉందన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రాజు యాదవ్ సహాయ కార్యదర్శి షేక్ నజీర్, నాయకులు మధు, రామకృష్ణ, షఫీ, బాషా, డేనియల్ రంగన్న మొహమ్మాద్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE SPECIAL
MAGISTRATE, NANDYAL
C. C. NO.1744/2019

ఆంద్రాజులమురళిమోహన్. ...ఫిర్యాదుదారుడు

V/S

రెడ్డిగారి సంజీవరెడ్డి, వయస్సు 48 సం,.
తండ్రి నారాయణరెడ్డి, హిందూ, వ్యాపారం, నివాసం
తలారిచెరువు గ్రామము,తాడిపత్రి మండలం,
అనంతపూర్ జిల్లా. ...ముద్దాయి

ముద్దాయికి సమన్లు

పై నెంబరు కేసులో ముద్దాయి అయిన నీవు,పైన కనపరచిన ఫిర్యాదుదారుడు, Negotiable Instruments Act సెక్షన్ 138 & 142 క్రింద, చెక్కు బౌన్స్ కేసును మీ పైన దాఖలు చేసి ఉన్నారు. పై కేసునందు కోర్ట్ వారు ముద్దాయి అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను, మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా ఉన్నారు. కావున పై కేసు నందు మీకు ఏమైనా అక్షేపణలు ఉన్న యెడల పై కోర్టునందు 15-10-2024 తేదీన ఉదయం 10.30 గం, లకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలసినది. లేని యెడల కేసును మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తరువు మేరకు)

వాయిదా తేదీ: 15-10 -2024

ఇట్లు,
శ్రీ P. వెంకట రమణ,
పిర్యాదుదారుడు తరపున అడ్వకేట్, నంద్యాల,
సెల్ నెం. 8142124555.

చెరువులకు హెచ్చెల్సీ నీరు విడుదల చేయాలి

పుట్లూరు : మండలంలోని చెరువులకు హెచ్చెల్సీ నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని చింతకుంట గ్రామంలో సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి నాయకులతోపాటు ప్రతిపక్ష నాయకులు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి తిరుపతి లడ్డు వివాదంపై రాజకీయం చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుతోపాటు సంక్షేమంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని చెరువలకు హెచ్చెల్సీ నీటిని విడుదల చేసి పంటలుకు సాగు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దన్న, ఓబుళపతి, బాలు, ఆంజనేయులు, శివ, బలరాముడు, కుళ్లాయప్ప, రామాంజి, డేవిడ్, సూరి, దేవుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లన్నీ గుంతలమయం

ఇబ్బంది పడుతున్న వాహనదారులు-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ గుంతలమాయంగా మారాయి. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా కంపచెట్లు పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లాలంటే ప్రయాణికులు నరకయాతన పడాల్సి వస్తోంది. ముఖ్యంగా చింతకుంట నుంచి కడవకల్లుకు వెళ్లే రహదారి, నారాయణరెడ్డిపల్లి నుంచి సాలవేములకు వెళ్ల దారి, పుట్లూరు నుంచి తక్కలపల్లికి వెళ్లే రోడ్డు, తక్కలపల్లి నుంచి గార్లపాడు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో ఈ రోడ్లు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్ల మరమ్మతులు చేయకపోవడం బాధాకరం. ఫలితంగా రోడ్లన్నీ గుంతలయమంగా మారాయి. దీనికితోడు రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు విపరీతంగా పెరగడంతో ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇప్పటికే ఆయా రోడ్లలో వెళ్తూ కింద పడి గాయాలైన ఘటనలూ అనేకంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాలకు వెళ్లే రహదారులను మరమ్మతులు చేయించడంతోపాటు రోడ్డు ఇరువైపులా ఉన్న కంపచెట్ల తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయమైన రోడ్లు

ముగిసిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ పాటల సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని శారద మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో నిర్వహించిన స్వర్ణోత్సవ పాటల సంబరాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. అనంతరం యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య యుటిఎఫ్ ఆవిర్భావం నుంచి ఉపాధ్యాయుల శ్రేయస్సే పరమావధిగా పోరాటాలు చేసిందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం ఉపాధ్యాయులుగా మన బాధ్యత అన్నారు. అంతేగాకుండా వరదలు వచ్చినప్పుడు, కరోనా సమయంలోనూ యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు అనేక సామాజిక సేవలు చేశారని గుర్తు చేశారు. అంతకుమునుపు నిర్వహించిన వివిధ ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలల చెస్‌పోటీల్లో ప్రథమ బహుమతి నాగలక్ష్మి, ద్వితీయ బహుమతి తులసి, తృతీయ బహుమతి అరుంధతి, క్యారమ్స్ డబుల్స్ పోటీల్లో ప్రథమ బహుమతి అరుంధతి, శ్యామల, ద్వితీయ బహుమతి నాగలక్ష్మి, సరళ, పురుషుల చెస్ విభాగంలో విన్నర్స్‌గా శ్రీనివాసులు, బాబు, రన్నర్స్‌గా రవి, ప్రకాష్, పురుషుల క్యారమ్స్ విన్నర్స్ పీఎస్పీ నాయుడు, వెంకట సుబ్బారెడ్డి, రన్నర్స్‌గా శేఖర్, సాలెంబాబు, త్రో బాల్ విన్నర్స్, విన్నర్స్‌కు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, గౌరవాధ్యక్షులు రమణయ్య, సహాధ్యక్షులు రామప్ప, సరళ, జిల్లా కార్యదర్శులు ప్రమీల, సంజీవ్‌కుమార్, శేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, వివిధ మండలాల నాయకులు చంద్రమోహన్, శ్రీనివాసులు, ఆదిశేషయ్య, రఘు, నాగరాజు, నాగేంద్ర, లక్ష్మీదేవి, నాగేంద్రకుమార్, రాజశేఖర్, వీరూపాక్షి, సాలెంబాబు, తదితరులు పాల్గొన్నారు.



చెస్ పోటీల్లో పాల్గొంటున్న మహిళా ఉపాధ్యాయులు

సమస్యాత్మక గ్రామాలు, కాలనీల్లో తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఆదివారం వేకువజామునే పోలీసులు కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్లు చేపట్టారు. సిఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లు, ఇతర రాష్ట్రాల మద్యం, నాటు సారా, గుట్కా నియంత్రణ కోసం పాతకేసుల్లోని నిందితుల ఇళ్లళ్లు, మరియు పశువుల పాకలు, గడ్డివాములను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి ప్రశాంతంగా జీవించాలని సూచనలు చేశారు. ఎలాంటి అల్లర్లకు వెళ్లకూడదని కోరారు. మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని ఆవులదట్ల గ్రామంలో రాయదుర్గం అర్బన్ సిఐ జయానాయక్ ఆధ్వర్యంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా కర్ణాటక మద్యం, మట్కా, జూదం ఆడే ఇళ్లు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తర్వాత గ్రామంలో కలియ తిరుగుతూ పలు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పామిడి : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు మండలంలోని కొండాపురం గ్రామంలో సి.ఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఆదివారం వేకువజామునే కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా వాహనాలు తనిఖీలతోపాటు అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ముఖ్యంగా మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సూత్రప్రాయమైన కవిత్వానికి విస్తృత వ్యాఖ్యానమే విమర్శ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బాధా సర్పద్రష్టులైన ప్రజల జీవితమూలాలను సూత్రప్రాయంగా వ్యక్తీకరించిన కవుల కవిత్వాన్ని విస్తృతమైన వ్యాఖ్యానంతో పాఠకునికి చేరవేయడమే కవిత్వ విమర్శ అని ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో తూముచర్ల రాజారామ్ విమర్శనా గ్రంథం 'మట్టి పూలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సభకు అధ్యక్షత వహించిన స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖరశాస్త్రి మాట్లాడుతూ కవులు కవిత్వంలో వ్యక్తీకరించిన వేదనలను తనలోకి ఒంపుకుని, అదే గాఢతతో పాఠకునికి చేరవేస్తున్న రాజారామ్ గొప్ప విమర్శకుడు అని కొనియాడారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి రాయలసీమలో నివసిస్తున్న కవులందరూ రాయలసీమ కవులు కాదని, రాయలసీమ గురించి కవిత్వం రాసిన కవులే రాయలసీమ కవులని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతి నారాయణ, సీనియర్ కవి రాధేయ, డాక్టర్ కె.నాగేశ్వరాచారి, ఉప్పరపాటి వెంకటేశులు, తరిమెల అమరనాథరెడ్డి, టీవీ.రెడ్డి, అశ్వర్థరెడ్డి, ప్రగతి, సుప్రియ, కృష్ణమూర్తి, సురేష్, మల్లప్ప, సుబ్బారావు, షేక్ నబిరసూల్, జెట్టి జయరామ్, పూజారి ఈరన్న, శేషాచార్యులు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

'మట్టిపూలు' పుస్తకావిష్కరణలో రాచపాళెం



'మట్టిపూలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

నేడు చలో కలెక్టరేట్

అనంతపురం కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు వై.వెంకటనారాయణ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులు, మెడికల్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల జీవితాలు మారడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక చేయూత

బుక్కరాయసముద్రం : మండలంలోని హమాలీ కాలనీలో నివసిస్తున్న విద్యార్థులకు ఫీజులుచెల్లించేందుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం ఆర్థిక చేయూత అందించారు. ఈనెల 26న హమాలీ కాలనీ నిర్వమించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు విద్యార్థులు సునీత (6వ తరగతి), సంతోష్ (7వ తరగతి) ఫీజులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఆయా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడంతోపాటు నోట్ పుస్తకాలు, బ్యాగులుకు ఆర్థికసాయం అందించారు.

సమతా సైనిక్‌దళ్ నూతన కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గం : పట్టణంలోని అభ్యుదయ పాఠశాల ఆవరణలో సమత సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షులు సుగుమంచి శ్రీనివాసులు అధ్యక్షతన రాయదుర్గం నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా వెంకటరమణ, అధ్యక్షులుగా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా సిద్దేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా రంగస్వామి, గోవిందప్ప, కార్యనిర్వాహక కార్యదర్శిగా ప్రసాద్, అధికార ప్రతినిధిగా వెంకటేశులు, మీడియా కన్వీనర్‌గా మహేష్, సోషల్ మీడియా కన్వీనర్‌గా రఘును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ఓబులేషు, కార్యదర్శి ఈశ్వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గాయని లతామంగేష్కర్‌కు నివాళి

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్స్టిట్యూట్‌లో ప్రముఖ గాయని, భారతరత్న లతామంగేష్కర్ జయంతిని పురస్కరించుకుని పద్మశ్రీ బాలసుబ్రమణ్యం కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నివాలులర్పించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం గాయకులు ఆలపించిన పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ డిఎంఇ ప్రమోద్, డాక్టర్ ఎం.శాంతి ప్రియ జ్యోతి, పద్మశ్రీ బాలసుబ్రమణ్యం కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున రావు, ఉపాధ్యక్షుడు జ్ఞానశేఖర్, సి.విజయభాస్కర్, జెమినీ సురేష్‌గౌడ్, రైల్వే ఇనిస్టిట్యూట్ కార్యదర్శి రవికుమార్, గాయకులు నాగరాజు, సుధాకర్ బాబు, జాఫర్, శ్రీదేవి, రసూల్, బాలమురళి, చలపతి, తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న సహజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు లెనిన్‌బాబు

వయనాడ్ బాధితులకు విరాళం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సేకరించిన రూ.17 వేల విరాళాన్ని ఆదివారం జిల్లాకు వచ్చిన కేరళ రాష్ట్ర ప్రణాళిక సంఘం అధ్యక్షుడు వికె.రామచంద్రన్‌ను ట్రస్టు వ్యవస్థాపకులు లెనిన్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయనాడ్ వరద బాధితుల సహాయార్థం విలువల బడుల విద్యార్థులు సేకరించిన మొత్తాన్ని అందించినట్లు తెలిపారు. సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి మాజీ శాసనమండలి సభ్యులు గేయానంద్, సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ వివరించగా .విలువల బడుల విద్యార్థులు, ఉపాధ్యాయుల సహాయాన్ని రామచంద్రన్ అభినందించారు.

నేరాలు ఘోరాలు

భార్యను హత్య చేసిన భర్త



జ్యోతమ్మ (పాతచిత్రం)

గుమ్మఘట్ట : మండల పరిధిలో ఉన్న కలుగోడు గ్రామంలో భార్యను భర్త హత్య చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు,, జ్యోతమ్మ (33)కు పదేళ్ల క్రితం గలగల గ్రామానికి చెందిన కొల్లప్ప కుమారుడు వన్నూరుస్వామితో వివాహమైంది. ఈ నేపథ్యంలో మెట్టినింట్లో అత్త, భర్త బాధలు ఎక్కువ కావడంతో నెలరోజుల క్రితం పుట్టిళ్లు కలగోడుకు వచ్చింది. అయితే ఆదివారం రాత్రి భర్త వన్నూరుస్వామి కలగోడులోని భార్య వద్దకు వచ్చి చక్కగా సంసారం చేసుకుంటానని నమ్మబలికాడు. దీంతో అక్కడే నిద్రించాడు. అయితే తెల్లవారుజామున జ్యోతమ్మను గొంతు కోసి పరారైనట్లు బంధువులు తెలిపారు. ఉదయం గమణించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ ఈశ్వరయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయదుర్గం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

అగ్ని ప్రమాదంలో దుకాణం దగ్ధం



దుకాణాన్ని పరిశీలిస్తున్న ఫైర్ సిబ్బంది

అనంతపురం క్రైం : స్థానిక కళ్యాణదుర్గం బైపాస్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బ్యాటరీల దుకాణం దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నగరానికి చెందిన సలావుద్దీన్ కళ్యాణదుర్గం బైపాస్‌లో బ్యాటరీలకు ఛార్జింగ్ పెట్టే దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి యధావిధిగా బ్యాటరీలను ఛార్జింగ్ పెట్టి ఇంటికి వెళ్లాడు. రాత్రి 9.45 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ అయ్యి దుకాణంలో మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను ఆర్పి వేశారు. అయితే అప్పటికే దుకాణం కాలిపోవడంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. దుకాణం ఇళ్లకు ఆనుకుని ఉండటంతో చుట్టుపక్కల వారు భయాందోళనలకు గురయ్యారు. సకాలంలో ఫైరింజన్ రావడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

గడ్డివామి దగ్ధం



కాలుతున్న గడ్డివామిని పరిశీస్తున్న ఫైర్ సిబ్బంది

పామిడి : మండలంలోని ఎదురూరు గ్రామంలో టిడిపి నాయకుడు కొండేటి రామకృష్ణకు చెందిన గడ్డివామికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. వెంటనే ఫైర్ ఇంజిన్‌కు ఫోన్ చేయగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. తర్వాత సిఐ యుగంధర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఆరాతీశారు. ఈ ప్రమాదం ద్వారా దీంతో సుమారు రూ.1.5లక్షల ఆస్తినష్ట సంభవించింది. కాగా మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గౌస్‌పీరా, ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు జయరామ్ ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఐచర్‌ను ఢీకొన్న ప్రయివేటు బస్సు

16 మందికి గాయాలు

గార్లదిన్నె : మండల పరిధిలోని తలగాచిపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఐచర్ వాహనాన్ని ఓ ప్రయివేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో 16 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు నుంచి హైదరాబాదుకు 30 మంది వలస కూలీలతో వెళ్తున్న ఐచర్ వాహనం తలగాచిపల్లి క్రాస్ వద్ద స్పీడ్ బ్రేకర్ వద్ద వెనుక నుంచి వచ్చిన ప్రయివేట్ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఐచర్‌లో ఉన్న 16 మందికి గాయాలయ్యాయి. వీరిలో జ్యోతి, శాంతకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వారిని దసరా పండుగ కోసం సొంత గ్రామానికి వెళున్నట్లు తెలిసింది. బస్సు క్లీనర్ ఉమందాకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన కూలీలను 108 ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్ తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు, గాయపడిన కూలీలు

ఆటో బోల్తా..నలుగురికి గాయాలు



గాయాలపాలైన బాధితులు

పుట్లూరు : మండల పరిధిలోని ఎ.కొండాపురం వద్ద ఆటో బోల్తా పడడంతో నలుగురికి గాయాలయ్యాయి అనంతపురానికి చెందిన రామమోహన్, రమాదేవి, కార్తీక్, జగన్‌తోపాటు ఆటో డ్రైవర్ రవితో కలిసి కడప జిల్లా తాళ్లపొద్దుటూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా కొండాపురం గ్రామం వద్ద రాగానే స్టీరింగ్ ఊడిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో నలురుగూ గాయపడ్డారు. వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.